క్లుప్తంగా

పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారిణి ఉమాభరణి

భోగాపురం: రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారిణి ఉమాభరణి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో పామాయిల్ సాగుపై సోమవారం శిక్షణ ఇచ్చారు. నీటి సదుపాయం ఉన్న మెట్ట, పల్లం భూముల్లో పామాయిల్ సాగు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. హెక్టారుకు 143 మొక్కలను సమాంతర కోణంలో నాటుకోవాలని, అలా అయితే హెక్టారుకు రూ.27,599 చొప్పున ప్రభుత్వం రైతుకు రాయితీ అందిస్తుందన్నారు. పామాయిల్ ప్రధాన సాగులో అంతర పంటలు కూడా వేసుకుని, అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కోర్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇదే విషయాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మహాసభలో కమిటీ సభ్యులు వెల్లడించారు. అధ్యక్షుడిగా ఎరుకొండ ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా మిరియాల కృష్ణారావు, కోశాధికారిగా షిణగం శివాజీ, ఉపాధ్యక్షుడిగా పంపాన రామారావు, మమ్ముల తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా యు.శాంతికుమారి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

విజయనగరం టౌన్: బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ నంబరు అనుసంధానం సహా ఎన్‌పీసీఐ లింక్ వంటి సేవలు స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయంలో అందించడం జరుగుతోందని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కోసం సదరు సేవలు అవసరమవుతున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జూన్ 5వ తేదీలోగా ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింకు వంటివి చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రోగి బంధువులే వార్డు బాయ్స్..



గజపతినగరం రూరల్ :ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని గొప్ప లు చెప్పుకునే కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయలేకపోతోంది. గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో వార్డు బాయ్స్ లేకపోవడంతో రోగి బంధువులే వీల్‌చైర్‌ను తోసుకెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే విషయమై ఆస్పత్రి పర్యవేక్షకుడు జగదీష్ వద్ద ప్రస్తావించగా.. వార్డు బాయ్స్ ఉన్నారని, వారు వచ్చే వరకు రోగులు వేచి ఉండకుండా అక్కడుంటే వీల్ చైర్‌లను వినియోగించుకుంటున్నారని బదులిచ్చారు.

జ్వరాలపై సర్వే



తుమ్మికాపల్లి గ్రామంలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలోని తుమ్మికాపల్లి గ్రామం, తుమ్మికాపల్లి గేట్ ప్రాంతాల్లో జ్వరాలపై వైద్య సిబ్బంది సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు సత్యారావు మాట్లాడుతూ .. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారు రుమాలు, మాస్క్‌లు వినియోగించాలని సూచించారు. ఆరుబయట తినుబండారాలు తినవద్దన్నారు. అలాగే ఇంటి పరిసర ప్రాంతాల్లో టైర్లు, తాగేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, తదితర పరీక్షలు ఉచితంగా చేస్తామని, ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఈశ్వరరావు, జ్యోతి, జగదీశ్వరి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు!

- నిబంధనలు పాటించని స్క్రాప్ దుకాణాలు
- సామర్థ్యానికి మించి తుక్కు నిల్వలు
- కానరాని అగ్నిమాపక పరికరాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రధాన రోడ్డు పక్కనే నిర్వహిస్తున్న స్క్రాప్ షాపు(ఫైల్)

విజయనగరం: నగర పరిసరాల్లో ఇష్టారాజ్యంగా స్క్రాప్(తుక్కు) దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ వాటిని నిర్వహిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామర్థ్యానికి మించి వ్యర్థాలు నిల్వ చేయడంతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు కనీస చర్యలు చేపట్టడం లేదు. షాపుల వద్దే కొన్ని ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను కాల్చివేస్తుండడంతో వాయుకాలుష్యం సంభవిస్తోంది. దీనికి తోడు భరించరాని దుర్వాసన వస్తోంది. ఒక్కోసారి ఊపిరి తీసుకోలేనంతగా గాలి కలుషితమవుతోందని పరిసర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూసినట్లు వ్యవహరిస్తున్నారని, తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నగరంలోని వీటీ అగ్రహారం వద్ద నిర్వహిస్తున్న ఓ స్క్రాప్ దుకాణం దీనికో నిదర్శనం.

జీఎస్టీ చెల్లించడం లేదు..

ఏడాదికి రూ.20 లక్షల వ్యాపారం దాటితే జీఎస్టీ చెల్లించాలి. కానీ ఆ స్థాయి ఆదాయం వచ్చినా తప్పుడు లెక్కలు చూపించి పన్ను కట్టకుండా తప్పించుకుంటున్నారు. షాపు నిర్వాహకుల దగ్గర రూ.20 లక్షల వ్యాపారం జరగకపోతే కనీసం ఈ స్క్రాప్ మొత్తాన్ని అమ్మే వారి దగ్గర నుంచైనా ఈ పన్ను చెల్లించాలి. అయితే ఇవేవీ కానరావడం లేదు. తుక్కు దుకాణాల వద్ద అంత వ్యాపారం జరగపోతే అన్ని దుకాణాల నుంచి స్క్రాప్ కొనుగోలు చేస్తున్న వారి దగ్గరైనా రూ.20 లక్షల వ్యాపారం జరగదా అనే అభిప్రాయం అందరూ వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా పన్ను భారం తగ్గించుకునేందుకు తప్పుడు లెక్కలతో మోసాలకు పాల్పడుతున్నారు. కొంతమంది అధికారులకు ఎంతో కొంత ఇచ్చి, పన్ను కట్టకుండా తప్పించుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

ప్రమాదాలకు అవకాశం..

తుక్కు దుకాణాల వద్దకు ఎక్కువగా విరిగిన ప్లాస్టిక్ కుర్చీలు, ఆటవస్తువులతో పాటు గాజు, ఇనుప వస్తువులు విరివిగా వస్తుంటాయి. వాటన్నింటినీ వేర్వేరుగా తుక్కుగా చితక్కొట్టి బస్తాల్లో నింపుతుంటారు. ఇలా పోగైన బస్తాలను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. అయితే ఇలా వ్యర్థాల నిల్వలు ఉన్నచోట అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదవశాత్తు ఏ చిన్న అగ్నిప్రమాదం సంభవించినా అది పెద్ద మొత్తంలో నష్టాన్ని తీసుకువస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వచ్చే మంటలు అంత త్వరగా ఆరవు. దీనికి తోడు గాజు సీసాలు వేడికి వ్యాకోచించి బద్దలైపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఎవరికీ ఇబ్బంది కలగని చోట వీటిని ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇలాంటి దుకాణాలు కనిపిస్తుండడం గమనార్హం. ముఖ్యంగా కొత్తపేట, వీటీ అగ్రహారం ప్రాంతాల్లో ఇవి తారసపడుతున్నాయి.



రోడ్డు పక్కనే భారీగా ప్లాస్టిక్, పాలిథిన్, గాజు వ్యర్థాల నిల్వలు(ఫైల్)

పర్యవేక్షణ కరువు..

దుకాణాలకు అనుమంతి ఉందా లేదా అనే పర్యవేక్షణ లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడే విచ్చలవిడిగా షాపులు పెడుతున్నారు. షాపు పెట్టేందుకు అవసరమైన ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారా లేదా అనేది అధికారులు చూడాలి. ఈ దిశగా అధికారుల చర్యలేవీ కానరాకపోవడంతో అక్రమ వ్యాపారుల ఆగడాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలి. గృహాలకు దగ్గరగా ఉండే దుకాణాలను వేరే చోటకు తరలించాలి.

నిబంధనలు ఇలా..

ఎక్కడైనా స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే అది జనావాసానికి దూరంగా ఉండాలి. జాతీయ రహదారులను ఆనుకుని ఉండకూడదు. అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే నివారణ పరికరాలు ఉండాలి. నీరు, ఇసుక వంటివి అందుబాటులో ఉంచుకోవాలి. ప్రదేశంలో సామర్థ్యానికి మించి నిల్వలు చేయకూడదు. గాలి కాలుష్యం జరిగే పనులు చేపట్టరాదు. కొంతమంది వ్యాపారులు ధనార్జనే లక్ష్యంగా ఈ నిబంధనలేవీ పట్టించుకోకుండా ప్రజారోగ్యం ఎలాపోతే తమకు ఎందుకు.. జేబు నిండితే సరిపోద్ది అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి ఉదాహరణగా నగరంలోని వీటీ అగ్రహారం వద్ద నడుపుతున్న తుక్కు దుకాణం నిలుస్తోంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

మా ఊరి దగ్గరలోని తుక్కు దుకాణంతో ఇబ్బందులు పడుతున్నాం. ఊరిలో చెత్తంతా షాపు వద్దకే తరలిస్తున్నారు. రోడ్లపై గుట్టలుగుట్టలుగా ప్లాస్టిక్, పాలిథిన్, గాజు వ్యర్థాలు వేసేస్తున్నారు. వారికి అవసరం లేని వ్యర్థాలను కాలుస్తుండడం, ఒక్కోసారి అలాగే కొన్ని నెలలుగా వదిలేస్తుండడం దుర్వాసన వస్తోంది. ఇదే విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– ఎం.శ్రీనివాసరావు, వీటీ అగ్రహరం, విజయనగరం

కాగితపు బొమ్మల తయారీపై శిక్షణ



కాగితపు బొమ్మలు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి తదితరులు

విజయనగరం టౌన్: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కాగితపు బొమ్మల తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. అంతకుముందు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించి, అనంతరం కాగితాలతో ఏ విధంగా వివిధ బొమ్మలు తయారు చేయాలో సిబ్బంది నేర్పించారు. పిల్లలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. లక్ష్మీనారాయణపురం, టిక్కలి, చంద్రంపేట, కొండవెలగవాడ గ్రామాల్లో సోమవారం సిబ్బంది పర్యటించి, దివ్యాంగ బాలలపై ఇంటింటికీ వెళ్లి, ఆరాతీశారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను దివ్యాంగ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించి, విద్య, ఫిజియోథెరపీ అందివ్వనున్నామని పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. అలాగే భవిత కేంద్రం ద్వారా ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో మండల సహిత విద్యా విభాగం కో–ఆర్డినేటర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీరే బాస్‌లా వ్యవహరిస్తే ఎలా?

- నెల్లిమర్ల నగరపంచాయతీ కమిషనర్‌పై కౌన్సిలర్ల మండిపాటు



సమావేశంలో ధ్వజమెత్తుతున్న నాయకులు

నెల్లిమర్ల: నగరపంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ తీరుపై కౌన్సిలర్లు, టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఈ నెల 30వ తేదీన జరిగే నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టే అజెండాపై చర్చించేందుకు మండల కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు విషయాల్లో కౌన్సిలర్లు లెంక అప్పలనాయుడు, చిక్కాల రవి, కారుకొండ కృష్ణ, ముడిమంచి లక్ష్మణరావు తదితరులు కమిషనర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీరు(కమిషనర్‌ను ఉద్దేశించి) చేసే పనుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.. కౌన్సిలర్లను సంప్రదించకుండా మీరే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. మీరే బాస్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులను సైతం ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. కార్యాలయానికి పిలిపించుకుని మరీ డబ్బులు అడుగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని, దాన్ని పరిష్కరించడం లేదని వాపోయారు.

పాలన చేతకాకుంటే చెప్పండి..

వార్డుల్లో పర్యటించడం మంచిదేనని, అయితే గుర్తించిన సమస్యలకు పరిష్కారం ఎక్కడన్నారు. పట్టణానికి చెందిన అన్ని పార్టీల పెద్దలతో చర్చించిన తర్వాతనే ఏదైనా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలన చేతకాకపోతే కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక సందర్భంలో కమిషనర్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా నాయకులు, సభ్యులు అడ్డగించారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో సమస్యల పరిష్కారానికి, మెరుగైన పాలనకు కౌన్సిల్ సభ్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్న ఇళ్ల జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, జానా సంధ్యారాణి, బూర సుజాత, నాయకులు పొంద్రంకి సత్యానారాయణ, పైల మురళి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

డెంకాడ: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మహేష్ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయానికి సోమవారం విచ్చేసిన విద్యార్థులకు వివిధ కథల పుస్తకాలు చదివించడంతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు, నైతిక విలువలు వంటివి తెలిపారు. ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్న గ్రంథాలయాల శిక్షణ తరగతులకు అందరూ హాజరుకావాలని కోరారు.

వితరణ

డెంకాడ: మండలంలోని బంటుపల్లి గ్రామంలో సీతారామ ఆలయ అభివృద్ధికి మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు రూ.25 వేలు సోమవారం వితరణ చేశారు. ఉదయం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ పూజలకు హాజరైన ఆయన స్వామి వారికి విశేష పూజల అనంతరం నగదును ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జనార్దనరావు, సురేష్, రవికిరణ్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు

విజయనగరం అర్బన్: స్థానిక ఉల్లివీధిలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. జిల్లాలోని సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు కార్యక్రమానికి విచ్చేసి, అవగాహన పెంచుకోవాలని కోరారు.

నా భూమి వేరొకరి పేరిట మార్చేశారు..

భోగాపురం: వారసత్వంగా లభించిన తన భూమిని తనకు తెలియకుండా వేరొకరి పేరిట మారిపోయిందని న్యాయం చేయాలని భోగాపురానికి చెందిన అడపా వరహాలమ్మ కోరారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలో తహసీల్దారును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తన భర్త నుంచి తనకు వచ్చిన భూమి ఆన్‌లైన్‌లో తన పేరు మీద చూపించడం లేదని, వేరే వారి పేరు చూపిస్తోందన్నారు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని, తన పేరిట తన భూమి ఆన్‌లైన్‌లో చూపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జూన్ 1 నుంచి పాఠశాలలో ప్రవేశాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో జూన్ 1వ తేదీ నుంచి ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎంపికైన 100 మంది విద్యార్థులతో కూడిన జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించామని, జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు. మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరిగిందని, నిబంధనల ప్రకారమే అడ్మిషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు.

యోగాపై శిక్షణ

విజయనగరం అర్బన్: స్థానిక ఉడా కాలనీ శ్రీసత్యయోగా కేంద్రంలో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. యోగా గురువు, రిటైర్డ్ టీచర్ కొరపోలు సత్యారావు శిక్షణకు హాజరవుతున్న వారికి యోగాసనాలు వేయడం నేర్పిస్తున్నారు. అనంతరం యోగాసనాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

'ఉపాధి' కల్పించండి



ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నెల్లిమర్ల మండలం, సారిపల్లి గ్రామ దళితులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసనకు దిగారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు వల్ల తమ భూములు ముంపునకు గురవుతున్నాయని, వ్యవసాయం చేసినా నష్టం తప్ప లాభం రావడం లేదన్నారు. దీంతో సాగు వదిలి కూలి పనులు చేద్దామంటే పనులు దొరకడం లేదన్నారు. వ్యవసాయ పనులే ఆధారంగా జీవిస్తున్న తమకు ఇప్పుడు ఎటువంటి పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. కనీసం ఉపాధి పనులైనా కల్పించాలని లేకుంటే వలసపోవడం తప్ప చేయాల్సిందేమీ లేదని వాపోయారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయి ఈశ్వరరావు, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

పిల్లల పెంపకంపై శ్రద్ధ వహించాలి

- న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తమ దైనందిక జీవితంలో బిజీగా మారిపోయి పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ కనబరడం లేదని, దీని వల్ల చిన్నారులు ఎంతో నష్టపోతున్నారని గజపతినగరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. పిల్లల పెంపకంపై తప్పనిసరిగా శ్రద్ధ కనబరచాలని సూచించారు. మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల విద్యాభివృద్ధితో పాటు వారి నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేడు అనేక మంది పిల్లలు కనబడకుండా పోతున్నారని.. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. చిన్నారుల తల్లిదండ్రులకు సలహాలు, సాయం చేసేందుకు న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

బొండపల్లి: గత సార్వత్రిక ఎన్నికల సంద్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపించారు. మండలంలోని బోడసింగిపేటలో సోమవారం నిర్వహించిన సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి, నాయకులు జేబులు ఏలా నింపాలో అన్న పనిలోనే నిమగ్నమైందని ఆరోపించారు. పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఇసుక, మట్టి, మద్యం మాఫియా ఎక్కువైందని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాలు జరగక కార్మికులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. అధికారులు కూడా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారున. జూలై 26, 27 తేదీల్లో బొబ్బిలిలో జిల్లా మహసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా పురం అప్పారావును, సహాయ కార్యదర్శిగా గేదెల రామునాయుడును, సభ్యులుగా లెంక శ్రీను, దాసరి గడ్డినాయుడు, సంగిరెడ్డి నారాయణరావు, దాసరి ఆది, తదితరులను ఎన్నుకున్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి..

- విద్యుత్ శాఖధికారుల తీరును తప్పబట్టిన ఇప్పలవలస గ్రామస్తులు



మాట్లాడుతున్న ఇప్పలవలస విద్యుత్ వినియోగదారులు

మెరకముడిదాం: విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలేమిటో.. అవాస్తవాలు ఏవో తెలుస్తాయి తప్ప, ఏసీ రూముల్లో కూర్చుని ప్రెస్‌నోట్‌లు విడుదల చేయడం సరికాదని మండలంలోని ఇప్పలవలస గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారులు అన్నారు. సర్పంచ్ బెహరా రమేష్, బిళ్లలవలస సర్పంచ్ ప్రతినిధి తిరుమలరాజు నరసింహరాజు(వర్మ)లతో కలిసి పలువురు విద్యుత్‌వినియోగదారులు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మా గ్రామానికి ఆరు నెలల కిందట వరకు విద్యుత్ బిల్లుల వసూళ్లకు ఆర్‌ఈసీఎస్ నుంచి అధికారులు వచ్చేవారని.. గత ఆరు నెలలుగా మాత్రం బిల్లుల వసూలుకు ఏపీఎస్‌ఈబీ సిబ్బంది ఎవ్వరూ రావడం లేదన్నారు. ఇదే విషయాన్ని మా సర్పంచ్ రమేష్ ద్వారా విలేకరుల సమావేశంలో తెలియజేయగా.. ఈ విషయమై ఈ నెల 19న 'విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించేది..?' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైందని చెప్పారు. ఈ కథనానికి విద్యుత్‌శాఖ ఈఈ జిల్లా కేంద్రంలో స్పందిస్తూ సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం అవాస్తవమని ప్రెస్‌నోట్ విడుదల చేయడం సరికాదన్నారు. విద్యుత్ శాఖాధికారులు ఎవ్వరూ గ్రామంలోకి వచ్చి ఎంక్వైరీ చేయకుండా జిల్లా కార్యాలయాల్లో కూర్చొని ప్రెస్‌నోట్‌లు ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితి తెలుసుకోకుండా మాట్లాడితే కన్స్యూమర్ కోర్టుకు వెళ్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు కె.సాంబ, మిరియాల రామప్రసాద్, కె.మురళీధరరావు, మంత్రి పైడినాయుడు, సత్యం, సీహెచ్.సత్యనారాయణ, రేజేటి వెంకటినాయుడు, చింతపల్లి రామారావు, వెంకటరమణ, లోచర్ల ఆది, సీహెచ్ స్వామినాయుడు, రౌతు అప్పలనాయుడు, సిరిపురపు సింహాచలం, బోని సన్యాసిరావు, ఎం.శంకర్, కొండేటి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్‌ను ఉల్లంఘిస్తే పీడీ యాక్టు

- ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు



రామలింగాపురంలో కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖరనాయుడు

కొత్తవలస: సారా తయారీ, విక్రయాలు, రవాణ చేపట్టిన వారితో పాటు తయారీకి బెల్లం సరఫరా చేసిన వ్యక్తులపై తహసీల్దార్ విధించిన బైండోవర్‌లను ఉల్లంఘిస్తే సదరు వ్యక్తులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు అన్నారు. మండలంలోని రామలింగాపురం, ముసిరాం, అప్పన్నదొరపాలెం, చిన్నమన్నిపాలెంలతో పాటు వేపాడ మండలంలోని కుంపల్లి, కిష్టారాయుడుపేట గ్రామాలను సంపూర్ణ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ మహిళా పోలీస్, అటవీ శాఖ సిబ్బందితో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని.. వారు గ్రామాల్లో పర్యటించి సారా వల్ల కలిగే నష్టాలను వివరిస్తారని చెప్పారు. కార్యక్రమలో ఎక్సైజ్‌శాఖ ఎస్సైలు ఎస్‌వీఎస్.రాజు, రమ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నడక వంతెన



రామలింగాపురంలో కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖరనాయుడు

వేపాడ: మండలంలోని చామలాపల్లి పంచాయతీకి చెందిన వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం, తదితర గ్రామాలకు వెళ్లేందుకు మారిక గెడ్డపై నిర్మించిన నడక వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విశాఖ ఎంపీ నిధులతో నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. మారిక కొండ పైనుంచి వచ్చే నీటి ఉద్ధృతికి వంతెన కూలిపోయే అవకాశం ఉందని గిరిజనులు చెబుతున్నారు. వంతెన కూలిపోతే వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం గ్రామాలకు చామలాపల్లి రైతులకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి కొత్త వంతెన ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ హనుమంతరావు వద్ద ప్రస్తావించగా.. నిధులు మంజూరైతే ఇరిగేషన్ నుంచి అనుమతులిస్తామని తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ ఆలయ ప్రారంభోత్సవం

వేపాడ: మండలంలోని బానాదిలో నూతనంగా నిర్మించిన పరదేశమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు వినాయక పూజ, రక్షాబంధన్, దీక్ష వస్త్రధారణ, పంచగవ్య ప్రాసన, యాగశాల ప్రవేశం, తదితర పూజలు పురోహితులు మేడపాటి కిశోర్‌శర్మ బృందం నిర్వహించింది. అలాగే మంగళవారం చతుర్వేదపారాయణం, పంచశయ్యాధివాసం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.